సాక్షి ప్రకాశం

బుధవారం | 28 | జూన్ | 2023



నకిలీ వేలిముద్రలతో రూ.51.25 లక్షల దోపిడీ

ఏఈపీఎస్ ఆధారంగా నకిలీ వేలిముద్రలతో ప్రజల ఖాతాల్లో నగదు కాజేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డయల్ 112కు వచ్చే ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరించారు. కమాండ్ కంట్రోల్ రూంను ఆమె పరిశీలించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీల్లో ప్రీ ఆడిట్ అమలు

- స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరి ప్రకాష్ వెల్లడి



మాట్లాడుతున్న హరిప్రకాష్

మార్కాపురం టౌన్: రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పోస్టు ఆడిట్‌కు బదులుగా ప్రీ ఆడిట్ విధానాన్ని అమలు చేస్తున్నామని స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరి ప్రకాష్ తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీలోని పొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాలులో ఆన్‌లైన్ ఆడిట్ ప్రొటోకాల్ అమలుపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రకాష్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ప్రతి సంవత్సరానికి ఒకేసారిగా నిర్వహిస్తున్న పోస్ట్ ఆడిట్ కార్యక్రమానికి బదులుగా ఇప్పటి నుంచి ప్రీ ఆడిట్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆడిట్ విధానంలో మార్పులను వివరించారు. కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కే నాగశ్రీనివాస్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఎల్ శంకర్‌నారాయణరెడ్డి, జిల్లా ఆడిట్ ఆఫీసర్లు డీ సింహాద్రి, మార్కాపురం, చీమకుర్తి, కనిగిరి, పొదిలి, గిద్దలూరు, దర్శి కమిషనర్లు సుభానీ, ఫజులుల్లా, నారాయణరావు, డానియేల్ జోసెఫ్, రామకృష్ణయ్య, మహేశ్వరరావు, అన్నీ పురపాలక సంఘాల సెక్షన్ హెడ్‌లు పాల్గొన్నారు.

2025-26లో మార్కాపురం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు

- ఏపీఎస్ఎంఐడీసీ ఎండీ మురళీధర్



సూపరింటెండెంట్‌కు సూచనలిస్తున్న ఎండీ మురళీధర్‌రెడ్డి

మార్కాపురం: మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులను త్వరగా పూర్తిచేయాలని, 2025- 26 లో మెడికల్ సీట్లకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎండీఐసీ) ఎండీ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మెడికల్ కళాశాల పనులను పరిశీలించిన అనంతరం జిల్లా వైద్యశాలకు వచ్చి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డితో మాట్లాడారు. మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేనాటికి మొత్తం 330 బెడ్లు ఉండాలని, ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో 100 బెడ్లు ఉన్నందున మరో 230 బెడ్ల కోసం ఇప్పుడున్న వైద్యశాలపై అదనపు గదులు నిర్మించి బెడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు వార్డులు ఏర్పాటు చేయడం వలన రోగులకు సేవల్లో ఇబ్బందులేమైనా ఉంటాయా ప్రశ్నించగా ఎలాంటి ఇబ్బందులుండవని సూపరింటెండెంట్ తెలిపారు. మార్కాపురం మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా నిపుణులైన డాక్టర్లు వస్తారని, రోగులకు మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన సేవలందించాలని, త్వరితగతిన అదనపు వార్డుల నిర్మాణం చేపట్టాలని తెలిపి, వైద్యశాలలో ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈయన వెంట ఈఈ విజయభాస్కర్ ఉన్నారు.

డీపీఎం పై విచారణ

ఒంగోలు అర్బన్: జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం మేనేజర్ (డీపీఎం)పై వచ్చిన లైంగిక ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజ్యలక్ష్మి మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్‌కు స్పందనలో బాధితులు ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదుదారులతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న డీపీఎంను విడివిడిగా విచారించారు. బుధవారం నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. బాధిత మహిళలు ఏపీసాక్స్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశారు.

పేదింట.. విద్యా కాంతులు



అమ్మ ఒడి డబ్బులు పడిన మెసేజ్‌తో సంబరం.. (ఫైల్)

నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దటమే కాకుండా పేదింట చదువుల కోసం ఇబ్బందులు పడకుండా ఏటా క్రమం తప్పకుండా అమ్మఒడి నిధులను ఇస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆర్థిక స్థోమతలేని వారు తమ పిల్లలను చదివించుకునేందుకు ఈ సాయం కొండంత అండగా నిలుస్తోంది. మూడు దఫాలుగా జిల్లాలో రూ.1024.85 కోట్లు తల్లుల ఖాతాలో జమయ్యాయి. బుధవారం 2,03,663 మంది తల్లుల ఖాతాల్లో రూ.305.46 కోట్ల నిధులు జమకానున్నాయి. మా పిల్లలపై ఇంత శ్రద్ధ తీసుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేమని తల్లులు అంటూ.. ప్రతి పేదింట విద్యా కాంతులీనుతున్నాయని సంబరపడుతున్నారు.

- నేడే అమ్మ ఒడి నిధులు విడుదల
- జిల్లాలో 2,03,663 మంది తల్లుల ఖాతాల్లో జమకానున్న మొత్తం రూ.305.46 కోట్లు
- గత మూడేళ్లలో రూ.1024.85 కోట్లు జమ

ఒంగోలు/కనిగిరి రూరల్:

జగనన్న అమ్మ ఒడి నిధులు వరుసగా నాలుగోసారి తల్లుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి తల్లి ఖాతాలో క్రమం తప్పకుండా నిధులు జమచేస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పేదింట బిడ్డల చదువుకు ఆర్థిక భారం లేకుండా ఆదుకుంటున్న తీరు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గత మూడు దఫాల్లో జిల్లాలో రూ.1151.87 కోట్ల నిధులు జమ చేశారు. ఈ ఏడాది 2,03,663 మంది తల్లుల ఖాతాల్లో రూ.305.46 కోట్ల నిధులు వేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో ఈ మొత్తం విడుదల చేస్తారు.

ఆర్థికభారం ఉండరాదనేదే తాపత్రయం:

అమ్మ ఒడి పథకం కేవలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే అందిస్తే సరిపోతుందని చాలామంది వాదిస్తున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న అందరికీ ఇవ్వడమే సరైనదని భావించారు. చాలామంది తల్లులు తాము కూలి పనులు చేసుకుంటూ కూడా తమ బిడ్డలను ఉన్నతంగా చదివించాలన్న లక్ష్యంతో స్థోమత లేకపోయినా ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్న ఘటనలు నెలకొన్నాయి. ఇదే నేపథ్యంలో ఈ మొత్తాన్ని కేవలం పాఠశాల విద్యార్థులకే కాకుండా ఇంటర్ విద్యార్థులకు కూడా అందించాలని భావించి ఒకటో తరగతి మొదలు ఇంటర్ వరకు నిధులను కేటాయించారు. డిగ్రీ, ఆపై చదువులకు ఎలాగూ జగనన్న విద్యాదీవెన, జగన్న వసతి దీవెన పథకాలు ఉండడంతో బడిలో చేరింది మొదలు ప్రతి పిల్లవాని విద్యకు అవసరమైన మొత్తాన్ని అందించడంతోపాటు తక్కువ రేటుకే ల్యాప్‌టాప్‌లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారు. విద్యలో విప్లవాత్మకమైన మార్పును తీసుకొస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా ప్రజల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు.

నియోజకవర్గాల వారీగా గత రెండేళ్లలో విడుదలైన నిధులు:

నియోజకవర్గం	2020–21 లో లబ్ధిదారుల సంఖ్య	2020–21 లో విడుదలైన మొత్తం	2021–22లో లబ్ధిదారుల సంఖ్య	2021–22 లో విడుదలైన మొత్తం
దర్శి	27,209	4,081.35	28,914	4,337.1
గిద్దలూరు	25,223	3,783.45	27,055	4,058.25
కనిగిరి	23,710	3,556.5	25,465	3,819.75
కొండపి	21,740	3,261	24,798	3,719.7
మార్కాపురం	25,889	3,883.35	26,132	3,919.8
ఒంగోలు	25,041	3,756.15	25,019	3,752.85
సంతనూతలపాడు	21,584	3,237.6	20,538	3,080.7
వై.పాలెం	26,933	4,039.95	31,855	4,778.25
మొత్తం	1,97,329	29,599.35	2,09,776	31,466.4

మొదటి విడత: 2019-20
లబ్ధిదారుల సంఖ్య: 2,76,115
– మంజూరు చేసిన మొత్తం రూ.414.20 కోట్లు (ఉమ్మడి జిల్లా)

రెండో విడత: 2020-21
లబ్ధిదారుల సంఖ్య: 1,97,329
– మంజూరు చేసిన మొత్తం రు295.99 కోట్లు (విభజన ప్రకాశం)

మూడో విడత: 2021-22
లబ్ధిదారుల సంఖ్య 2,09,776
– మంజూరు చేసిన మొత్తం రూ.314.66కోట్లు (విభజన ప్రకాశం)

నాలుగో విడత: 2022-23 (నేడు విడుదల చేసేది)
లబ్ధిదారుల సంఖ్య 2,03,663
–మంజూరు చేస్తున్న మొత్తం రూ.305.46 కోట్లు

మండలాల వారీగా లబ్ధిదారుల సంఖ్య

మండలం	విద్యార్థుల తల్లుల వివరాలు
అర్ధవీడు	3325
బేస్తవారిపేట	4616
చీమకుర్తి	7276
సీఎస్‌పురం	3120
కంభం	3980
దర్శి	8662
దొనకొండ	5364
గిద్దలూరు	7789
హెచ్ఎంపాడు	2411
కనిగిరి	7972
కేకేమిట్ల	4663
కొమరోలు	3563
కొండపి	3447
కొత్తపట్నం	5083
కురిచేడు	4369
మద్దిపాడు	4001
మార్కాపురం	11294
మర్రిపూడి	4156
ముండ్లమూరు	5505
ఎన్‌జీ పాడు	4935
ఒంగోలు	19067
పామూరు	5312
పీసీపల్లి	2791
పెద్దారవీడు	4809
పొదిలి	6187
పొన్నలూరు	3299
పుల్లల చెరువు	6890
రాచర్ల	2951
ఎస్ కొండ	5389
ఎస్ఎన్ పాడు	3573
తాళ్లూరు	4403
టంగుటూరు	4644
తర్లుపాడు	3357
త్రిపురాంతకం	7064
వెలిగండ్ల	2953
యర్రగొండపాలెం	7691
జరుగుమల్లి	2959
దోర్నాల	4793
మొత్తం	2,03,663

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణ పడి ఉంటాం



మాది కనిగిరి మండలం పేరంగుడిపల్లి, నా కుమారుడు జశ్వంత్ ఎంపీపీఎస్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. రెండేళ్ల నుంచి మాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందచేస్తున్న అమ్మ ఒడి పథకంలో లబ్ధి పొందుతున్నా. ఈ ఏడాది కూడా అమ్మఒడి రానుంది. అమ్మ ఒడి పథకంతో పిల్లల చదువులకు అప్పులు చేసే పరిస్థితికి దూరమయ్యాం. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు ఫ్రీ గా ఇస్తున్నారు. అమ్మ ఒడి నగదు ఇవ్వడంతో కొంత మేర ఆర్థిక ఇబ్బంది తగ్గినట్లే. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంతలా ఆలోచిస్తున్న మన సీఎంకు రుణపడి ఉంటాం.

– దాసు బాబు, విద్యార్థి తండ్రి

తోబుట్టువు ఆదరించినట్లుంది



నా తోడబుట్టిన వారు నా పిల్లల చదువు పట్ల శ్రద్ధ తీసుకుని ఆదరించినట్లు అనిపిస్తుంది. నిజంగా మా పిల్లలపై ఇంత శ్రద్ధ తీసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేము. ఈ తరం పిల్లలు చేసుకున్న పుణ్యం జగనన్న అందరికీ మామయ్య కావటం. దేశంలో ఎక్కడా ఇలాంటి అవకాశం లేదు. మా జగనన్న వలన మా పిల్లలు కార్పొరేట్ స్కూల్లో చదువుకున్నట్లుంది. మా పిల్లలను ఎంతవరకైనా చదివించవచ్చనే నమ్మకం కలిగించిన దేవుడు జగనన్న.

– ఇందూరి దేవి, కురిచేడు

జల్ శక్తి అభియాన్ కింద ముమ్మరంగా పనులు



కలెక్టర్ దినేష్‌కుమార్‌తో జలశక్తి అభియాన్ నోడల్ అధికారి మనోజ్‌బాప్నా

- జల్‌శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారితో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో జల్ శక్తి అభియాన్ కింద నీటి సంరక్షణ కోసం పలు రకాల పనులు చేపడుతున్నామని జల్‌శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి మనోజ్ బాపనకు కలెక్టర్ దినేష్‌కుమార్ వివరించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన మనోన్‌బాపన ప్రకాశం భవనంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కార్యక్రమం వివరాలపై చర్చించారు. జిల్లాలో జల్‌శక్తి పనులపై కలెక్టర్ వివరిస్తూ నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, సాంప్రదాయ నీటి వనరులు, ట్యాంకుల పునరుద్ధరణ, రీయూజ్, రీచార్జ్ స్ట్రెక్చర్స్, వాటర్ షెడ్ అభివృద్ధి తదితర పనులు జిల్లాలో చేపడుతున్నామని తెలిపారు. జిల్లా ప్రొఫైల్‌తో పాటు వర్షపాతం వివరాలు, జల్‌శక్తి అభియాన్ అమలు తీరు, ఉపాధి హామీ కింద చేపట్టిన హార్టీ కల్చర్ ప్లాంటేషన్, మైక్రో ఇరిగేషన్ తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో జల్‌శక్తి కేంద్రం హాలులో మనోజ్ బాపనతో పాటు టెక్నికల్ ఆఫీసర్, కేంద్ర భూగర్భ జల బోర్డు శాస్త్రవేత్త యాదయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం నాగులుప్పలపాడు మండలంలోని పోతవరం గ్రామ పంచాయతీ, టంగుటూరు మండలంలోని కొణిజేడు గ్రామం, సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలోని అమృత్ సరోవర్ ట్యాంక్‌లను పరిశీలించారు. దీనిలో డ్వామా పీడీ శ్రీనారెడ్డి, జిల్లానీటి యాజమాన్య సంస్థ సీఈఓ ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడు లో మినరల్ వాటర్ ప్లాంటును పరిశీలిస్తున్న అధికారులు

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

- అమృత్ సరోవర్ కింద ఎంపికైన చెరువును పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు
- నీటిని కాపాడుకోవాలని గ్రామస్తులకు వివరణ

నాగులుప్పలపాడు: భూగర్భ జలాలను ప్రతి ఒక్కరూ బాధ్యతతో కాపాడుకోవాలని జలశక్తి అభియాన్ కేంద్ర బృంద సభ్యులు మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్ సెంట్రల్ డైరెక్టర్ మనోజ్ భావన తెలిపారు. అమృత్ సరోవర్ పథకం కింద ఎంపికైన నాగులుప్పలపాడు, పోతవరం గ్రామాల్లో ఊర చెరువులను మంగళవారం డ్వామా పీడీ శీనారెడ్డి తో కలిసి కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. అమృత్ సరోవర్ కింద ఎంపికైన చెరువుల అభివృద్ధి, ప్రజలకు ఉపయోగపడుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆ చెరువులకు నీటి వనరుల రాబడి, వినియోగం వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని, భవిష్యత్ లో నీటి వినియోగం వంటి అంశాలపై ప్రజలతో చర్చించారు. నాగులుప్పలపాడులో అమృత్ సరోవర్ కింద అమలవుతున్న వాటర్ ప్లాంట్ నీటిని పరిశీలించారు. చెరువుల అభివృద్ధి, నీటి లభ్యత, వినియోగం పై మరింత శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలుంటే కలెక్టర్‌కు తెలపగలిగినవి ఉంటే వివరించాలని ప్రజలను కోరారు. పరిశీలనలో కేంద్ర భూగర్భ జలవనరుల జియాలజిస్టు పి.యాదయ్య, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో జయమణి, ఏపీవో రవి కుమార్, టీఏలు, ఫీల్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



ప్రత్యేక బోటులో కొల్లంవాగు వద్దకు వెళ్తున్న మంత్రులు అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్

వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌లు మంగళవారం స్వయంగా పరిశీలించారు. శ్రీశైలం నుంచి ప్రత్యేక బోటులో కొల్లంవాగుకు చేరుకున్న మంత్రులు అక్కడి నుంచి వెలిగొండ ప్రాజెక్టు సొరంగ మార్గాల ద్వారా దాదాపు 19 కి.మీ ప్రయాణించి కొత్తూరు వద్దకు వచ్చారు.

– పెద్దదోర్నాల



రెండో సొరంగ మార్గం వద్ద మంత్రులు అంబటి, ఆదిమూలపు

రెవెన్యూ సమస్యలు గడువులోపు పరిష్కరించాలి

- కేటాయించిన పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రెవెన్యూకు సంబంధించిన సమస్యలను నిర్దిష్ట గడువు లోపు తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. భూ సేకరణ, రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్‌లతో మంగళవారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న చుక్కల భూముల కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ప్రాజెక్టులకు భూ సేకరణ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి రీ సర్వే ప్రక్రియలో సరిహద్దు రాళ్ల పాతే పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సవరణలు, ట్రాన్సాక్షన్, మ్యుటేషన్‌లలో పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని తహశీల్దార్‌లను ఆదేశించారు. పాత ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎల్ఆర్ రికార్డులను జూలై 10వ తేదీ నాటికి కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. వాటిని స్కాన్ చేసి భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉండేలా వివరాలను భద్రపరచాలన్నారు. కేటాయించిన పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి నెలా మండల కేంద్రంలో పౌరహక్కుల దినం నిర్వహించాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీవో, హౌసింగ్ ఏఈతో కలిసి ప్రతి బుధవారం తహశీల్దార్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్చేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కాలేజీలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలన్నారు. ఓటర్ల నమోదులో లింగ నిష్పత్తితో పాటు ఈపీ నిష్పత్తి కూడా మెరుగ్గా ఉండేలా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ శ్రీలత, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీవో అజయ్‌కుమార్, ఎస్‌డీసీలు, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.



మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు



బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

జగనన్న సుపరిపాలనలో సంక్షేమ పథకాలు

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- బద్వీడులో గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలో బద్వీడు చెర్లోపల్లె సచివాలయ పరిధి బద్వీడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌తో ప్రజలకు వివరించారు. తొలుత మంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు, తాగునీటి కోసం డీప్‌బోరును ప్రారంభించారు. పెద్దారవీడు నుంచి బద్వీడు గ్రామం వరకు తారురోడ్డు నిర్మించాలని గ్రామస్తులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడమే కాకుండా ప్రభుత్వ పాలన సైతం మారుమూల గ్రామాలకు తీసుకొచ్చి గాంధీజీ కలలుకన్న స్వరాజ్యాన్ని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను నెరవేర్చి రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలన్నింటినీ పరిష్కరించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఫ్యాను గాలికి కొట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచర్ల చెన్నమ్మ, ఎంపీటీసీ ముడమంచు రాజమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, నాయకులు కంచర్ల కేశయ్య, సుబ్బయ్య, ముడమంచు వెంకటకొండయ్య, పులి సుబ్బయ్య, ఎం రాజారావు, సొంటి లక్ష్మిరెడ్డి, సొంటి నాగార్జున రెడ్డి, ఎంపీడీఓ ఎం నాసరరెడ్డి, డీటీ రాజేష్, పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, విద్యుత్, హౌసింగ్ శాఖలు ఏఈలు రమేష్, శ్రావ్య, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ సాంబశివయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు వాహనాలను కండిషన్‌లో పెట్టుకోవాలి

● ఎస్పీ మలికాగర్గ్ ఆదేశం

ఒంగోలు టౌన్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా పోలీసు వాహనాలను కండిషన్‌లో పెట్టుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మంగళవారం పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగంలోని వాహనాల పనితీరును పరిశీలించారు. వాహనాలకు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, ఇంజిన్ ఆయిల్ మార్చడం, సర్వీసింగ్, మరమ్మతులు చేయాలని చెప్పారు. విధుల్లో ఉన్నప్పుడు డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని ఆదేశించారు. వాహనాలను కండీషన్‌లో ఉంచడంలో శ్రద్ధ పెడుతున్న ఒంగోలు రూరల్, మార్కాపురం సర్కిల్, ఆర్ఐ వెల్ఫేర్, పొదిలి ఎస్సై, వీఐపీ ఎస్కార్ట్ వాహనాలను గుర్తించి ఆయా వాహనాలకు చెందిన డ్రైవర్లను ప్రత్యేకంగా అభినందించారు. ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, ఎంవీఐ ఏ.కిరణ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన పోలా కుమారి

గిద్దలూరు రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పట్టణంలోని రాచర్ల రోడ్డులోని ఎస్టీ కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే..ఎస్టీ కాలనీకి చెందిన పోలా కుమారి(22) కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు.

ఉపాధి పనిచేస్తూ కూలి మృతి

● అనాథగా మారిన కుమారుడు


పిచ్చావతి మృతదేహం

ముండ్లమూరు: ఉపాధి హామీ పథకం పనికి వెళ్లిన కూలి గుడిపాటి పిచ్చావతి (40) సొమ్మసిల్లి పడి మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..పిచ్చావతి రోజు లానే మంగళవారం ఉదయం ఉపాధి పనికి వెళ్లింది. పనిచేస్తుండగా ఆకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో తోటి కూలీలు ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా..పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బీపీ నాలుగు శాతానికి పడిపోవడంతో గుండెపోటుకు గురై మృతి చెంది ఉండవచ్చని వైద్యులు తెలిపారు. మృతురాలి భర్త గుడిపాటి సుబ్బారావు 2007లో రైలు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్దకుమారుడు సురేంద్ర గత ఏడాది పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇక ఆ కుటుంబంలో ఉన్న చిన్న కుమారుడు తరుణ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అతనికి ఉన్న ఏకైక దిక్కు తల్లి మృతి చెందడంతో అనాథగా మిగిలాడు. నాయనమ్మ కోటి రత్నం అంధురాలు కావడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఏపీఓ కొండయ్య, ముండ్లమూరు సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ప్రభుత్వ పరంగా అందాల్సిన రాయితీలు వీలైనంత త్వరగా అందేలా చూస్తామన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మార్కాపురం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలు మార్కాపురం రూరల్ పరిధిలోని మిట్టమీదిపల్లి, ఇడుపూరు గ్రామాల్లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..విజయవాడ కృష్ణలంక నివాసి పాదిలి రామాంజి (33) ఈ నెల 19వ తేదీన ద్విచక్ర వాహనంపై తమ్ముడు కూతురుతో కలిసి మార్కాపురం మండలం మిట్టమీదిపల్లి గ్రామానికి వెళుతుండగా మోడల్ స్కూల్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఒంగోలులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేస్తుండగా సోమవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఇడుపూరుకు చెందిన యక్కంటి శ్రీనివాసరెడ్డి (38) సోమవారం రాత్రి వర్షంలో తన ద్విచక్రవాహనంపై ఇడుపూరుకు వెళ్తుండగా గ్రామానికి సమీపంలో బండి అదుపుతప్పి కిందపడ్డాడు. జిల్లా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రూరల్ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరు వెళ్లి ఈకేవైసీ

● నమోదు చేసిన వలంటీర్

పొదిలిరూరల్: మండలం మూగచింతల గ్రామస్తులు కొందరు బెంగళూరుకు భవన నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లారు. వారి పిల్లలకు జగనన్న అమ్మ ఒడి పథకం వర్తించాలంటే ఈకేవైసీ అవసరం. తమ గ్రామస్తులుకు నష్టం జరగకూడదు ఉద్దేశంతో గ్రామానికి చెందిన వలంటీరు జె. డెవిడ్‌రాజు బెంగళూరు వెళ్లి వారితో మాట్లాడి సకాలంలో ఈకేవైసీ నమోదు చేశాడు. దీంతో డేవిడ్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ వేలిముద్రలతో రూ.51.25 లక్షలు దోపిడీ

● 10 మంది నిందితుల అరెస్టు
● నిందితులు ప్రకాశం జిల్లా వాసులు
● సిబ్బందిని అభినందించిన నెల్లూరు ఎస్పీ


స్వాధీనం చేసుకున్న రెండు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఏఈపీఎస్ ఆధారంగా నకిలీ వేలిముద్రలతో ప్రజల ఖాతాల్లోని నగదు దోచుకుంటున్న ఓ ముఠాను నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం నెల్లూరులో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తవెల్లంటికి చెందిన ఓ మహిళ ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. ఆమెకు నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ ఎస్‌బీఐలో అకౌంట్ ఉంది. ఈ ఏడాది మార్చి నుంచి ఏప్రిల్ వరకు ఏఈపీఎస్ ఆధారంగా సైబర్ మోసగాళ్లు రూ.54,495 డ్రా చేశారు. ఆమె సెల్‌ఫోనుకు నగదు డ్రా అయినట్లు ఎలాంటి సందేశం రాలేదు. కొద్దిరోజుల తర్వాత ఆమె తన అకౌంట్‌ను పరిశీలించగా అందులో నగదు డ్రా అయినట్లు తేలింది. ఈ మేరకు ఆమె సోదరుడు నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేయగా సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితులు ప్రకాశం జిల్లా దోర్నాల మండలానికి చెందిన ఎస్.వెంకటేశ్వర్లు, టి.మధుసూదనరెడ్డి, డి.ఆనందరావు, ఎం.సాయికుమార్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, షేక్ ఉమర్, సీహెచ్ సన్నీ, ఎం.యువరాజ్, ఎస్.సుధాకర్, రవీంద్రలుగా గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. నిందితులు పది, ఇంటర్మీడియెట్, బీటెక్ చదువుకున్నారు. నిందితుల్లో ఒకరు కర్నూలుకు చెందిన డాక్యుమెంటర్ రైటర్ కాగా అతని వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.

ఆధార్ సేకరించి నకిలీ వేలిముద్రలతో...

ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో బ్యాంకు ఖాతాదారులు వేలిముద్రలు వేసి, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ద్వారా రోజుకు రూ.10 వేల వరకు డ్రా చేసుకునే వెసలుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని నిందితులు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్‌శాఖల్లో సమాచారాన్ని సేకరించి అందులో నుంచి వ్యక్తి పేరు, ఆధార్‌నెంబర్, ఫింగర్‌ప్రింట్‌ను సేకరించి ప్రత్యేక మిషన్స్, యాప్‌ల ద్వారా నకిలీ వేలిముద్రలతో ప్రజల ఖాతాల నుంచి నగదును నిందితులు దోచుకోసాగారు. ఇలా ఇప్పటి వరకు రూ.51.25 లక్షల నగదును దోచేసినట్లు పోలీసులు గుర్తించారు. కొందరు బాధితులను గుర్తించి వారి ఖాతాల్లోకి నగదును క్రెడిట్ చేశామని, మిగిలిన బాధితులను గుర్తించాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

1930కు ఫిర్యాదు చేయాలి

సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు లేదా దగ్గరల్లోని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. ఎం.ఆధార్ యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవడం ద్వారా ఏఈపీఎస్ ద్వారా ఖాతా నుంచి నగదు తీసుకోవడం అసాధ్యమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేసుకుని అవసరం ఉన్నప్పుడు మాత్రమే అన్‌లాక్ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ డి.హిమవతి, నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులరెడ్డి, సైబర్ క్రైమ్ టీం ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

● 'మార్గదర్శిని' చిత్తశుద్ధితో అమలు చేయాలి
● కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని, 9,10, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వారి ప్రతిభా పాటవాలకు తగినట్లు లక్ష్యాలు ఎంచుకోవడంలో మార్గదర్శిని (కెరియర్ గైడెన్స్) ఉపయోగపడాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక స్పందన భవనంలో మార్గదర్శిని మెంటార్‌లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే మార్గదర్శిని కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత ఏం చదవాలి, ఏ గ్రూపు ఎంపిక చేసుకోవాలి, ఇంటర్ పూర్తయిన తర్వాత ఏ కోర్సుల్లో చేరాలి వంటి ఆయోమయ పరిస్థితులు లేకుండా విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారికి తగినట్లు అవగాహన కల్పించాలన్నారు. జూలై 1వ తేది నుంచి డిసెంబర్ వరకు ప్రతి శుక్రవారం ఒక పీరియడ్ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై తరగతులు నిర్వహించాలన్నారు. అందుకోసం ప్రతి పాఠశాల, కళాశాలల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన టీచర్లు, లెక్చరర్‌లు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మెంటార్లు ప్రతి విద్యార్థితో ప్రత్యేకంగా మాట్లాడి వారికి ఏ రంగం వైపు ఆసక్తి ఉందో తెలుసుకుని వారి నైపుణ్యాలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, జేడీ్ప విద్యాధికారి సామా సుబ్బారావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి అంజల, గురుకుల పాఠశాలకో ఆర్డినేటర్ జయ, ఉప విద్యాధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● కంట్రోలు రూంను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ మలికాగర్గ్
● 112 సిబ్బందిని హెచ్చరించిన ఎస్పీ
● అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచన


కంట్రోలు రూం పనితీరును అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: డయల్-112కు వచ్చే ఫిర్యాదుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, జాప్యం చేసినా కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ మలికాగర్గ్ కంట్రోలు రూం సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోలు రూం (ఐసీసీఆర్)ను ఎస్పీ మలికాగర్గ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోలు రూం పనితీరు, అత్యవసర సేవల గురించి సిబ్బంది ప్రతిస్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు అనునిత్యం అనేక సమస్యలు, ఇబ్బందుల గురించి పోలీసుల సహాయం కోరుతూ వందల సంఖ్యలో ఫోన్లు చేస్తుంటారని తెలిపారు. తక్షణమే స్పందించి కాల్స్‌ను స్వీకరించి సమీపంలోని పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ విషయంలో సిబ్బంది ఎటువంటి జాప్యం చేసినా బాధిత ప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని సూచించారు. డయల్-112 సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటూ అంకితభావంతో పనిచేయాలని, వృత్తి నిర్వహణ విషయంలో చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. రెస్పాన్స్ టైం తగ్గించాలని, కంట్రోలు రూం పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని అధికారులకు సూచించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

డయల్ 112కు ఎస్పీ ఫోన్

కమాండ్ కంట్రోలు రూం పనితీరును పరిశీలించడానికి ఎస్పీ మలికాగర్గ్ స్వయంగా డయల్ 112కు ఫోన్ చేశారు. తన కాల్‌ను రిసీవ్ చేసుకున్న సిబ్బంది సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎమర్జెన్సీ రెస్పాన్స్ యూనిట్ సిబ్బందిని ఏ విధంగా అప్రమత్తం చేస్తున్నారో పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని డయల్ 112 పనితీరు గురించి అనేక ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, కమాండ్‌కంట్రోలు రూం సీఐ దుర్గా ప్రసాద్, ఐటీ కోర్ ఎస్సై కె.అజయ్ కుమార్, ఎస్సై కోటయ్య తదితరులు ఉన్నారు.

నూరుశాతం పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నూరుశాతం అర్హులందరికీ అందించాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పొందడంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్షా కార్యక్రమంలో 2.6 లక్షల మంది గ్రామ, వార్డు వలంటీర్లు, 1.5 లక్షల మంది సచివాలయ సిబ్బంది, 3వేల మంది మండల స్థాయి అధికారులు పనిచేస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 1.6 కోట్ల కుటుంబాలను కలవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. ప్రతి వలంటీర్ అతని పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వివరించి వారికి రావాల్సిన పథకాలు, ధృవీకరణ పత్రాల వివరాలను తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, న్యాయవాది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై దృష్టి సారించండి

● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మలికాగర్గ్


మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ మలికాగర్గ్ పోలీసు అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. జగనన్నకు చెబుదాం, గుడ్ ట్రయల మానిటరింగ్, ఈ బీట్స్, మిస్సింగ్ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అంశాలను సమీక్షించారు. చిన్నారులు, మహిళల కేసుల్లో అలసత్వం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని, దొంగతనాలు, దోపిడీల వంటి నేరాల కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. బక్రీద్ పండగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

రౌడీ షీటర్ల లిస్టు తయారు చేయాలి

పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్ల లిస్టు తయారు చేయాలని ఎస్పీ ఆదేశించారు, యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్ల కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టాలని, కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు వి.నారాయణ స్వామి రెడ్డి, రామరాజు, అశోక్ వర్ధన్, వీర రాఘవరెడ్డి, శ్రీనివాసులు, డీసీఆర్బీ సీఐ ధర్మేంద్ర పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలు

ఒంగోలు: జిల్లాలోని 28 కేజీబీవీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి తరువాత మిగిలిన సీట్లను జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారి ద్వారా భర్తీ చేశామని డీఈవో పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా చేరాలనుకుంటే ఒంగోలులోని సమగ్రశిక్ష కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దొంగ పట్టాల జారీ నిజమే

● ఎంపీడీఓ శ్రీనివాసులు


విచారణ చేస్తున్న ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ

పీసీపల్లి: మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి పంచాయతీలో ఇటీవల జరిగిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ అప్పల నాయుడు దొంగ పట్టాల జారీ విషయమై ఎంపీడీఓ ఆర్. శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ మల్లీశ్వరి మంగళవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులను కలిసి వివరాలు సేకరించారు. మండలంలో 121 మంది లబ్ధిదారులు కాగా అందులో 10 మందికి నకిలీ పట్టాలిచ్చినట్లు, అలాగే 34 మంది లంచాలు ఇవ్వకపోవడంతో వారి పట్టాలు అప్పల నాయుడు వద్దే ఉన్నట్లు గుర్తించారు. మిగతా వారికి ఒరిజినల్ పత్రాలిచ్చినట్లు తేల్చారు. కాగా 121 మంది లో 72 మంది నాన్‌లోన్ లబ్ధిదారుల దగ్గర నుంచి కూడా రూ.10వేలు వసూలు చేసినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా ఎంపీడీఓ విచారణ వస్తున్న సమాచారం తెలియగాను హుటాహుటిన అప్పలనాయుడు కట్టాల్సిన రుసుం కన్నా ఎక్కువ వసూలు చేసిన లబ్ధిదారులకు మిగతా రుసుం తిరిగి అందించారు. అలాగే అప్పల నాయుడు దగ్గర ఉన్న 34 పట్టాలను కూడా తిరిగి ఇచ్చేశారు. విచారణ అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ బాధితుల సమాచారాన్ని, విచారణ నివేదికను ఆర్డీవో, కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు.

ఉత్తమ పోలీసులకు ప్రత్యేక అభినందనలు


తాలుకా సీఐకి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పోలీసులు, మహిళా పోలీసులకు ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయలంలో జరిగిన నేర సమీక్షా సమావేశంలో ప్రశంసాపత్రాలను అందజేశారు. చీమకుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో హత్యకు గురైన ఒక మహిళ కేసులో నిందితుడికి జీవిత ఖైదుశిక్ష విధించడంలో కీలకపాత్ర పోషించిన ప్రస్తుత తాలుకా సీఐ రాంబాబు, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ హరికృష్ణలను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కేసులను సమర్థవంతంగా విచారిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను తగ్గించడంలో క్రియాశీలకంగా పనిచేసిన గిద్దలూరు ఎస్సై బ్రహ్మనాయుడు, కంభం ఎస్సై నాగమల్లేశ్వరరావు, పుల్లలచెరువు ఎస్సై శ్రీహరిలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఐదుగురు మహిళా పోలీసులను అభినందించిన ఎస్పీ.. వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

టాప్-5 మహిళా పోలీసులు వీరే...

సింగరాయకొండకు చెందిన భారతి, కొత్తపట్నంకు చెందిన బి.యామిని, మద్దిపాడుకు చెందిన కె.వెంకటలీల, ముండ్లమూరుకు చెందిన పి.జ్యోతిప్రియ, మద్దిపాడుకు చెందిన ఎం మాధవిలను ఎస్పీ అభినందించారు.

పాడుబడిన బావిలో శవమై తేలాడు

● యువకుడు అనుమానాస్పద మృతి


బావిలో మృతి చెందిన రాజశేఖర్


రోదిస్తున్న రాజశేఖర్ భార్య జ్యోతి, బంధువులు

కొనకనమిట్ల: పాడు బడిన దిగుడు బావిలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కొనకనమిట్ల వైన్ షాప్‌కు సమీపంలో సోమవారం రాత్రి జరగగా మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొనకనమిట్ల మండలం తువ్వపాడు పంచాయతీ మిట్టపల్లికి చెందిన స్నేహితులు మందలపు రాజశేఖర్ (32), కేసరి సురేష్, యక్కంటి వెంకటేశ్వర్లు ముగ్గురు కలిసి సోమవారం రాత్రి రాజశేఖర్ మోటార్ సైకిల్‌పై కొనకనమిట్లలోని వైన్ షాప్ వద్దకు వెళ్లారు. ముగ్గురు కలిసి మందు తాగుతుండగా ఆ సమయంలో ఐఎంఎల్ వెహికల్ వైన్ షాప్ తనిఖీకి వచ్చింది. పోలీసులు వస్తున్నారని భయపడిన ముగ్గురూ పక్కకు పరుగులు తీశారు. సురేష్, వెంకటేశ్వర్లు ఒక వైపు వెళ్లగా.. రాజశేఖర్ పాడు బడిన దిగుడు బావి ఉన్న వైపు వెళ్లి బావిలో శవమై తేలాడు. మంగళవారం ఉదయం సురేష్, వెంకటేశ్వర్లు ఇద్దరూ వైన్ షాప్ వద్దకు వచ్చి విచారించగా.. వైన్ షాప్ వద్దనే రాజశేఖర్ మోటార్ సైకిల్ కనిపించింది. చివరకు వైన్ షాప్‌కు సమీపంలోని దిగుడు బావిలో రాజశేఖర్ చనిపోయి ఉన్నాడని తెలుసుకొని బంధువులుకు తెలిపారు.

స్నేహితులపైనే అనుమానం

మృతుడు రాజశేఖర్, సురేష్ మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయనని తన భర్త రాజశేఖర్‌కు సురేష్ కొంత బాకీ ఉన్నాడని డబ్బు అడుగుతున్నాడనే కోపంతోనే తన భర్తను చంపి పడేశారని రాజశేఖర్ భార్య జ్యోతి, తల్లిదండ్రులు వెంకటేశ్వరరెడ్డి, ఆదెమ్మ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖర్ సెల్‌కు.. చంపుతానని సురేష్ మెసేజ్ చేశాడని ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజశేఖర్‌కి మూడేళ్ల కుమారుడు, రెండేళ్ల కూతురు ఉన్నారు. ఎస్ఐ దీపిక సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం రాజశేఖర్ మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.